# పందెం

"హాయ్ సీతా"

కారులోకి ఎక్కబోతున్న సీత వెనక్కి తిరిగి చూసింది. జీన్సుపాంటూ, టీ-షర్టూ, బాబ్డ్‌హెయిరూ, కళ్ళకి గాగుల్సూను. కళ్లకి నల్లద్దాల జోడుండడంతో గుర్తుపట్టడం కష్టమైంది. "హాయ్! నేను గీతను. మర్చిపోయావా? కల్సి చదువుకున్నాం. కాలనీలో పక్క పక్క ఇళ్లు మనవి. ఇంత తొందరగా మర్చిపోతావనుకోలేదు.

"సారీ, గుర్తుపట్టనందుకు. నిన్ను మర్చిపోవడమేమిటి? ఈ ఊళ్ళో వున్నావనే నాకు తెలియదు"

"మా ఆయన ఇక్కడే ఒక ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. నేనిక్కడ ఒక రెడీమేడ్ గార్మెంట్స్ షాపు నడుపుతున్నాను. నువ్వో?"

"ఆయన బ్యాంకు ఆఫీసరు. ఈ మధ్యనే ఈ ఊరు ట్రాన్స్‌ఫరైంది"

"మీ ఇల్లెక్కడ?"

"దగ్గరే. ఎప్పుడైనా రా మా ఇంటికి" తప్పనిసరై పిలిచింది సీత.

"ఎప్పుడో ఎందుకు. ఇప్పుడు నీతోనే వస్తాను" అంటూ కారెక్కింది గీత.

సీత మౌనంగా కారు నడుపుతోంది. పక్క పక్క ఇళ్ళు కాబట్టి తప్పనిసరైన పరిచయమే తప్ప గీత తనకు ప్రాణ స్నేహితురాలేమీ కాదు. అన్ని విషయాలలోనూ తమ అభిప్రాయాలు చుక్కెదురే. చదువు కాలక్షేపానికని గీత అనేది. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నప్పుడు క్లాసుఫస్టు వచ్చేలా చదవాలని తను అనుకునేది. లేటెస్టు ఫాషను డ్రెస్సులు గీతకిష్టం. నిరాడంబర వస్త్రధారణ తనకిష్టం. అన్నిటికన్నా సంసారం విషయంలో గీత అభిప్రాయాలు తనకే మాత్రమూ నచ్చేవి కావు.

"ఈ ప్రపంచాన్ని చూస్తే కోపమొస్తుంది సీతా, మగవాడికోరూలూ, ఆడదానికోరూలూను, మగవాడు ఎంతమంది ఆడవాళ్ళతో తిరిగినా తప్పులేదు. అదే ఆడది ఇంకో మగాణ్ణి కన్నెత్తి కూడా చూడకూడదు. ఎంత అన్యాయం?"

"నువ్వు చెప్పేది నిజమే. పెళ్ళయ్యాక నేను మావార్ని ఏకపత్నీవ్రతుడుగా తీర్చిదిద్దుకుంటాను"

"అది ఇంపాజిబుల్. మగవాళ్లెప్పుడూ ఏకపత్నీవ్రతులు కాలేదు. సెక్సు విషయంలో స్త్రీ పురుషులిద్దరికీ సమాన స్వేచ్ఛ ఉండాలి. అదే న్యాయం"

ఎంత ప్రయత్నించినా తను గీతను ఒప్పించలేకపోయేది. ఇప్పుడు గీత అభిప్రాయాలెలా ఉన్నాయో.

కారు ఇంటిముందు ఆపి గీతను లోపలకు తీసికెళ్ళింది. సోఫాలో కూర్చుని, సీత ఇచ్చిన కూల్‌డ్రింక్ తాగుతూ అడిగింది గీత.

"ఎలా వుంది నీ లైఫ్? మీవారెలా వుంటారు? విషయాలు చెప్పు"

"నా లైఫ్ చాలా హాయిగా వుంది. డబ్బుకీ, సుఖానికీ, ప్రేమకీ దేనికీ కొదవలేదు. మా వారికి నేనంటే చాలా ప్రేమ'

"నీ ఒక్కర్తిమీదే ప్రేమా?" గీత గొంతులో హేళన కన్పించింది.

సీత నిట్టూర్చింది. గీత ఏ మాత్రం మారలేదు. అభిప్రాయాలలో, వాటిని పైకి చెప్పడంలో ఆరేళ్ళ కిందట ఎలా ఉందో ఇప్పడూ అలాగే ఉంది. ఇలాంటి వాళ్ళకి గట్టిగానే జవాబు చెప్పాలి.

"అవును ఆయనకి నా ఒక్కదానిమీదే ప్రేమ. నా కన్నా అందగత్తెలు ఆయన ఆఫీసులోనే పనిచేస్తున్న వాళ్లే వున్నారు. ఆయన మనస్సెప్పటికీ వాళ్ళమీదకి పోదు"

సీత జవాబు గీతకి చెంపపగలగొట్టినట్లనిపించింది. ఏం మాట్లాడాలో తెలియక షోకేసు వైపు చూసింది. అక్కడ వున్న ఫోటో ఆమెను ఆలోచనలో పడేసింది.

"ఏదీ మీ పెళ్లిఫోటో చూడనీ. ఏక పత్నీవ్రతుడైన మీ వారికి దండం పెట్టుకోవాలి"

సీత ఫోటో తెచ్చి గీత చేతికిచ్చింది. ఫోటో చూస్తూ గీత అడిగింది.

"ఏ ఊరు మీవారిది?"

"బొంబాయి. చదువంతా అక్కడే చదువుకున్నారు. ఉద్యోగరీత్యా అన్ని ఊళ్ళూ తిరుగుతున్నాం" గీతలో ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

"మీ వారిమీద నీకు కొంచెం కూడా అనుమానం లేదా?"

"అసలు కొంచెం కూడా అనుమానం లేదు."

"పెళ్ళికి ముందు ఎలా వుండేవారో?"

సీతకి గీత మాటలతో విసుగొచ్చింది. ఇంటికి వచ్చి ఏదో సరదాగా మాట్లాడక ఇలాంటి వ్యక్తిగత విషయాలెందుకు?

"పెళ్ళికి ముందు ఎలా వుండేవారో నాకు అనవసరం. నా మెడలో తాళి కట్టేక ఆయన నన్ను కాదని ఇంకో ఆడదానితో వెళ్ళలేదు. వెళ్ళబోరు"

"పందెం కడతావా?"

"మా ఆయన మీద నాకు పూర్తి విశ్వాసముంది. పందెం అనవసరం. ఓడిపోతావు"

"చేస్టిటీ ఈజ్ ది లాక్ ఆఫ్ అపర్చునిటీ అన్నారు. అవకాశం లేనంతకాలం అందరూ పవిత్రులే. ఎల్లవేళలా నువ్వు కాపలా కాస్తూ మీ ఆయన పవిత్రుడనుకుంటున్నావు. అందుకే పందెం అనేసరికి నీకు భయం వేసింది. నాకు నా సిద్ధాంతాల మీద నమ్మకముంది. నీకు నీ సిద్ధాంతాల మీదా, మీ ఆయనమీదా నమ్మకం లేదు."

సీతలో పౌరుషం ముంచుకొచ్చింది.

"సరే పందెం కడుతున్నాను. నా భర్త ఏకపత్నీవ్రతుడు"

"పందెం పదివేల రూపాయలు" ఛాలెంజ్‌గా అంది గీత.

తన భర్త శీలానికి ఖరీదు కట్టడమా? సీతకి ఎందుకో మనస్సంతా చేదుగా అన్పించింది.

ఈ రోజు ఇల్లు కదలకపోయినా బావుండేది. ఇప్పుడీ పరిస్థితిని ఎలా తప్పించుకోవడం?

"ఈ గురువారం రాత్రి మీ ఇంట్లోనే అవకాశం కల్పించు. నా సంగతి తెలుసుగా. ఎట్టి పరిస్థితిలోనూ అబద్ధమాడను. మా ఆయన టూర్లో వున్నాడు. ఎవర్తితోనో సుఖంగానే వుంటాడులే"

❖ ❖ ❖

రాత్రి భర్త రమేష్ పక్కన పడుకుని సీత నెమ్మదిగా అడిగింది - "మా తమ్ముడింటికి వెళ్ళి చాలా రోజులైంది. ఒకసారి వెళ్ళిరానా?"

ఆమెను దగ్గరగా తీసుకుంటూ రమేష్ - "నిన్ను వదిలి నేను ఉండగలనా?" అన్నాడు.

"గురువారం ప్రొద్దుటే వెళ్ళి, శుక్రవారం సాయంత్రానికి వచ్చేస్తాను" ఎంతో కష్టం మీద వచ్చాయి సీత మాటలు.

"అలాగే" అంటూ ఆమెను దగ్గరగా తీసుకున్నాడతను.

అరగంట తరువాత అలసటతో, ఆనందంతో రమేష్ గుండెలపై తల పెట్టుకున్న సీత 'ఒక్క రోజైనా ఈయనను వదిలి నేనుండగలనా? ఎందుకు పందెం ఒప్పుకున్నానో' అనుకుంది.

❖ ❖ ❖

గురువారం రాత్రి టీ.వీ. చూస్తున్న రమేష్ కాలింగ్ బెల్ చప్పుడు విని, లేచి తలుపు తీశాడు. ఎదురుగా ఒకామె చేత్తో సూట్‌కేస్‌తో నిల్చుని వుంది. ప్రశ్నార్థకంగా చూశాడు రమేష్.

"నా పేరు గీత. నేను సీత ఫ్రెండుని. ఈ రోజు వస్తున్నాననీ, స్టేషనుకి రమ్మనీ టెలిగ్రాం ఇచ్చాను. టెలిగ్రాం అందలేదా?"

"సీత ఊళ్ళో లేదు. వాళ్ళ తమ్ముడింటికి వెళ్ళింది. టెలిగ్రాం అందినట్లు లేదు"

"మై గాడ్ ఇప్పుడెలా? ప్లీజ్ మీరు ఏమీ అనుకోకుంటే రేపు ప్రొద్దుటే మా వాళ్ళింటికి వెళ్ళిపోతాను. రాత్రి ఇక్కడ వుండవచ్చా?"

కాదని ఎలా అనడం? రమేష్ లోపలకు రమ్మన్నాడు. లోపలకు వచ్చిన గీత అతన్ని పరీక్షగా చూసినట్లు చూసి - "హాయ్ రమేష్ నువ్వా?" అంది.

రమేష్ గీతకేసి చూశాడు. ఆమె కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి. అతడి మనస్సు గతంలోకి వెళ్ళింది.

❖ ❖ ❖

బొంబాయిలో తమ ఫ్లాట్‌లో ఒక్కడూ కూచుని వున్నాడు రమేష్. అతడి అమ్మా, నాన్నా ఊరెళ్లేరు. కాలింగ్ బెల్ మోగింది. ఎవరో అమ్మాయి తలుపు తియ్యగానే లోపలకు వచ్చేసింది.

"ఎదురు ఫ్లాటులో వుంటున్నాం. నా పేరు గీత. మా 'వి.సి.ఆర్. పాడైంది. రేపు సాయంత్రం కాసెట్ ఇచ్చెయ్యాలి. ప్లీజ్. మీ ఇంట్లో చూస్తాను".

ఎప్పుడూ కాలేజీ, మిగతా ఆక్టివిటీస్‌లో తిరిగే తనకి ఎదురింట్లో ఎవరున్నారో కూడా తెలియదు. మొహమాటంగా సరే అన్నాడు.

ఆమె చనువుగా టేప్ పెట్టుకుని, వి.సి.ఆర్., టీ.వీ. స్విచ్చిలు వేసి సోఫాలో కూర్చుని - "మీరూ చూడండి" అంది.

ఈ అమ్మాయి ఎంత ధైర్యంగా ప్రవర్తిస్తోంది. ఏం సినిమా తెచ్చిందో. ఇంట్లో ఒక్కడికీ బోరు కొడుతోంది. చూస్తే సరి' అని అనుకుంటూ రమేష్ సోఫాలో రెండో చివర కూర్చున్నాడు.

సినిమా చూస్తున్న రమేష్‌కి గుండె చెదిరినట్లనిపించింది. నగ్న దృశ్యాలూ, శృంగార సన్నివేశాలూ మొదటిసారిగా చూస్తున్న అతనికి ఒళ్లు వేడెక్కినట్లనిపించింది. గీత అతనికి దగ్గరగా జరిగింది.

"ఏమిటి సాఫ్ట్‌పార్టీకే అంతగా బెదిరిపోతున్నారు. నా గుండె చూడండి ట్రిపిల్ ఎక్స్‌రేటెడ్ మూవీ చూసినా మామూలుగానే కొట్టుకుంటుంది" అంటూ అతని చేతిని తీసుకుని తన ఎదమీద గట్టిగా నొక్కుకుంది. సినిమాలో అదే సన్నివేశం నడుస్తోంది. రమేష్‌లో ఆవేశం సముద్రంలా ఉప్పొంగింది. అతను గీతను గాఢంగా కౌగిలించుకున్నాడు. ఆమె కిలకిలా నవ్వుతూ సోఫాలో వాలిపోయి అతణ్ణి మీదకు లాక్కుంది.

చాల సేపయిన తర్వాత అలసటగా పడుకున్న అతణ్ణి ముద్దు పెట్టుకుంటూ, "కంపెనీ లేకుండా సినిమా చూడడం బోరనిపించింది. మీరూ ఒక్కరే ఉన్నారు కదా అని వచ్చాను. మంచి కంపెనీ ఇచ్చారు థాంక్యూ" అని చెప్పి వెళ్ళిపోయింది.

రమేష్‌కి కళ్ళు తిరిగినట్లనిపించింది. సెక్స్‌ని ఇంత కాజువల్‌గా తీసుకోడమా. ముక్కూ ముఖం తెలియని మనిషితో తనీ విధంగా ఎలా ప్రవర్తించాడు?

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే రమేష్‌కి బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. చాలా రోజులదాకా అతను మామూలు మనిషి కాలేకపోయాడు.

❖ ❖ ❖

గతం తల్చుకుంటున్న రమేష్‌కి గీత ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. ఇటువంటి మనిషి తన భార్య సీతకు స్నేహితురాలయి వుండదు. తన వివరాలు సేకరించి బ్లాక్‌మెయిల్ చెయ్యడానికి వచ్చిందేమో.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్న గీత మాటలతో ఆలోచనల నుంచి రమేష్ బయటపడ్డాడు. డ్రెస్సుమార్చినట్లుంది. పల్చటి నైట్‌గౌన్‌లో నుంచి శరీరంలోని ఒంపులన్నీ కనబడుతున్నాయి.

"ఏం చూస్తావు బాబూ బి.బి.సి. న్యూస్" అంటూ టీ.వీ.లో ఛానెల్ మార్చింది. సినిమాలో శృంగార సన్నివేశం చూసి తృప్తిగా నిట్టూర్చి రమేష్ ఒక్కోనే అన్నంత దగ్గరగా కూర్చుంది.

❖ ❖ ❖

తమ్ముడింట్లో గెస్టురూంలో పడుకున్న సీతకి ఎప్పటికీ నిద్ర రాలేదు. పందేనికి ఎందుకు ఒప్పకున్నానా అని ఆమె. మథనపడుతోంది. తన భర్త ఏకపత్నీవ్రతుడన్న గర్వమా, తను నమ్మిన సిద్ధాంతాలు నిజమన్న అహంకారమా, తనలా ఎవరూ భర్తను రంజింప చెయ్యలేరన్న నమ్మకమా - తనెందుకు పందేనికి ఒప్పకుంది?

తన భర్త వీరాధివీరుడని రుజువు చెయ్యడానికి సింహాలున్నచోట్లోకి చేతి గ్లవ్‌ని విసిరేసిన నారీమణిని వర్ణించిన ఇంగ్లీషు పద్యం చిన్నప్పడు చదివింది.

తనూ అలాగే ప్రవర్తించిందా? భర్తకు తమ పందెం గురించి చెప్పడానికి వీల్లేదన్న షరతును ఇద్దరూ ఒప్పకున్నారు. గీత చెప్పకుండా వుంటుందా? అసలు గీతకు చెప్పాల్సిన అవసరమేముంది? ఆలోచిస్తూంటే గీత ఏదో పథకం వేసే తనను ఛాలెంజి చేసినట్లుంది. తన భర్తది బొంబాయి. గీత కొన్నాళ్లు బొంబాయిలో వుంది. అప్పడు పరిచయముందేమో. పందెం పేరుతో తననింట్లో నుంచి పంపేసి గీత తన భర్తతో హాయిగా ఈ రాత్రిని ఎంజాయ్ చేస్తోందేమో. భర్త దగ్గరలేడన్న బాధతో గీత భర్తతో సుఖపడుతుందేమోనన్న బెంగతో, పందెం ఏమవుతుందో నన్న భయంతో సీత నిద్రపోలేదు.

❖ ❖ ❖

గీత తన దగ్గరకు వచ్చి కూర్చోగానే రమేష్‌లేచి నిలబడ్డాడు. "అదేమిటి అలా లేచి వెళ్లిపోతున్నావు? సీత భర్తవు నువ్వేనని తెల్సి ఎంత సంతోషపడ్డానో తెలుసా? సీత ఊళ్లోలేదు. అప్పట్లానే ఎంజాయ్ చేద్దాం"

అతను మాట్లాడకుండా తన రూంలోకి వెళ్లిపోబోయాడు. గీతలో సమయం

మించిపోకుండా చూసుకోవాలన్న ఆలోచన కదిలింది. పూర్తిగా తనే చొరవ చూపించాలి. ఆమె అతనిని పెనవేసుకుంటూ, ముద్దు పెట్టుకోబోయింది.

అతడామెనుంచి బలవంతంగా విడిపించుకున్నాడు. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

"బొంబాయిలో జరిగింది మర్చిపోయావా? ఆ ప్రేమావేశం ఏమయింది?"

"మర్చి పోలేదు. అనుక్షణం సిగ్గుపడుతున్నాను. ఆకలి విపరీతంగా వేసినప్పుడు ఎంగిలి మెతుకులైనా తింటాం. షడ్రసోపేతమైన భోజనం రుచి తెలిశాక జిహ్వ మామూలు రుచులను అంగీకరించదు. ఏమీ తెలియనప్పుడు ఒక్కసారి కాలు జారేను. కానీ స్త్రీ పురుషుల మధ్య ఉప్పొంగే ప్రేమను సుందరంగా సున్నితంగా వ్యక్తపరచేందుకు భగవంతుడిచ్చిన వరం సెక్సు అని నేర్చుకున్నాను. ప్రేమావేశమన్న పెద్దమాట వాడేవు. మన మధ్య ప్రేమ ఎక్కడిది? ఆవేశం ఆనాడే చల్లారిపోయింది. నా ప్రేమానురాగాలు పూర్తిగా నా భార్యకే అంకితం. ఇకమీదైనా సెక్సుని కాజువల్‌గా తీసుకోడం మానెయ్యి. ఎందుకొచ్చావో కానీ అర్ధరాత్రి ఎక్కడకు వెడతావు? ఆ గదిలో పడుకుని ప్రొద్దుటే వెళ్ళిపో. మనం మనుషులం పందుల్లా పొర్లితే, కుక్కల్లా కలియుబడితే, మనకీ, జంతువులకీ తేడా ఏమిటి?"

❖ ❖ ❖

పోస్టులో వచ్చిన పదివేల రూపాయల చెక్కునూ చింపేస్తూ సీత 'ఇప్పటికైనా నా మార్గం సరైనదని నమ్మి మంచిగా బతకడానికి ప్రయత్నించు గీతా' అనుకుంది తృప్తిగా.

(స్వాతి వీక్లీ)